సంక్షేమానికి పెద్ద పీట వేసిన సీఎం జగన్

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 36వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీటవేస్తూ పేదల ప్రజల జీవితాలలో వెలుగులు నింపారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. 36వ వార్డు గంగానమ్మపేటలోని గడప గడపకు మన ప్రభుత్వం గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ 36వ వార్డు ఇన్‌చార్జి తొలిచూరి నాగ మల్లేశ్వరరావు, గుర్రం హేమలత, స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ 36వ వార్డు కమర్షియల్ ఏరియాలో ఉంటుందని చెప్పారు. వార్డులో ఇప్పటి వరకు రూ.9.69 కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు తెలిపారు. వార్డులో పర్యటిస్తున్నప్పుడు ప్రజలు పలు రోడ్లు, కాల్వలపై ఫిర్యాదులు చేశారని, వాటిని నాలుగు నెలల్లో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే వీధి దీపాలు, విద్యుత్ స్తంభాల సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రభుత్వంపై ప్రజలు సానుకూల దృక్పథంతో ఉన్నారని, రానున్న రోజుల్లో మరోసారి తమ ప్రభుత్వానికి పట్టంకట్టనున్నారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు తోట రఘురామ్, గడవర్తి సాయిహరేరామ్, కో-ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, 36వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బట్ట అంజిబాబు, అర్ల శ్రీనివాసరావు, బట్ట శ్రీమన్నారాయణ, గుర్రం కిరణ్, జంగయ్య, బసవయ్య, భీరం శ్రీనివాసరావు, తాడిబోయిన నాగార్జున, లోకేష్, భీరం లోకేశ్వరరావు, భరణి శ్రీనివాసరావు, కొల్లిపర సత్యనారాయణ, పార్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, బూరెల దుర్గ, కుర్రా శ్రీను, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, షేక్ గఫూర్, షేక్ మీరావలి, శ్రీనివాసరెడ్డి, కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్, సిరికృష్ణ, సతీష్‌రెడ్డి, సిహెచ్.సాయి, కాకిదేవ సహాయం పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతి విద్యార్థి అంతర్జాతీయ క్రీడాకారుడిగా ఎదగాలి



మున్నంగి(కొల్లిపర): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి కలపరిచి అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని తెనాలి రూరల్ సీఐ కడప శ్రీనివాసరెడ్డి సూచించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ వేడుకల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పవర్‌లిఫ్టింగ్ చాంపియన్(కామన్ వెల్త్ గేమ్స్) ఎన్.జ్ఞాన దివ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ నైపుణ్యాన్ని కనపర్చి గెలుపునకు ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో ఆరిగ కోటిరెడ్డి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కళ్ళం వెంకటప్పారెడ్డి పాల్గొన్నారు.

ఆకమణలు తొలగింపు



తెనాలి అర్బన్: పాత గవర్నమెంట్ హాస్పిటల్ ప్రహరీ వెంబడి ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు గురువారం తొలగించారు. ఎంతో కాలంగా చిరు వ్యాపారులు వ్యాపారం చేసుకుంటున్న విషయం తెలిసిందే. అక్కడ ట్రాఫిక్ సమస్య ఎక్కువగా కనిపించడం, ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్కడికి వెళ్లి వాటిని తొలగించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్లు సుధాకర్, సుబ్బారావు, టీపీఎస్ సాంబశివరావు తొలగింపు పర్యవేక్షించారు.

కోడి పందేలు వేస్తే కఠిన చర్యలు

కొల్లిపర: కోడి పందేలను ప్రభుత్వం నిషేధించడంతో మండలంలో సంక్రాంతి ముసుగులో కోడి పందేలు, జూదాల జోలికి పోవద్దంటూ ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి గురువారం జోరుగా పలుగ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా కోడి పందేలు నిర్వహించినా, పందేలు కాసినా, కోడి పుంజులను అమ్మినా నేరమన్నారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పదని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని 08644-244233 , 9440900863 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

జానపద వీరుడు ఎన్టీఆర్



తెనాలి: తెనాలిలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతజయంతి మహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్థానిక పెన్షనర్స్ అసోసియేషను హాలులో ఎన్టీఆర్ వ్యక్తిత్వం, నటించిన సినిమాలు, రాజకీయ జీవితంపై చర్చా వేదిక నిర్వహించారు. కొడాలి వీరప్రకాశరావు, లక్కరాజు లక్ష్మణరావు జానపద వీరుడు ఎన్టీఆర్ అనే అంశంపై ప్రసంగించారు. ఇదే వేదికపై సమీక్షకులుతో పాటు ప్రముఖ గాయకుడు రావూరి రాజారావును సత్కరించారు. అవధాని, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, కేసన కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పానేని రాఘవరావు, గరికపాటి సుబ్బారావు, వేములపల్లి మల్లికార్జునరావు, దేవిశెట్టి భాస్కర్ పాల్గొన్నారు.

పాస్టర్లు, వితంతువులకు దుస్తులు పంపిణీ



తెనాలి టౌన్: నాజరుపేటలోని మిషన్ కాంపౌండ్‌లో గురువారం రత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాస్టర్లు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. పాస్టర్లకు ప్యాంటు, షార్టు, వితంతువులకు చీరలను టౌన్ చర్చి పాస్టర్ రెవరెండ్ దేవరపల్లి యేసురత్నం, గౌరాపీటర్, దేవరపల్లి వినయ ప్రకాష్ (హైదరాబాద్)లు అందజేశారు. నూతన సంవత్సరం సందర్భంగా సేవా కార్యక్రమంలో భాగంగా దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ దేవరపల్లి టైటస్, సెక్రటరీ దేవరపల్లి సైఫి, తమలపాకుల ప్రసాదకుమారి, కొట్టి ఎలీషాపాల్ పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్ఈబీ అధికారుల కథనం మేరకు వివరాలు.. దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరుకు చెందిన కావూరు బుజ్జిబాబు గురువారం తెనాలి మండలం కొలకలూరు గ్రామంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో 30 క్వార్టరు సీసాలను కొనుగోలు చేశాడు. వీటిని వాహనంలో పెట్టి గ్రామానికి తరలిస్తుండగా ఎస్ఈబీ అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహాన్ని సీజ్ చేయడంతో పాటు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

రోటరీ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యశిబిరాలు

డిస్ట్రిక్ట్ గవర్నర్ టి.రాజశేఖరరెడ్డి


మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, రాజశేఖరరెడ్డి తదితరులు

తెనాలి: క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం రోటరీ తరఫున రూ.2.40 కోట్లతో సమకూర్చిన రెండు క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సులతో జిల్లాలో ఇప్పటికే 700 ఉచిత శిబిరాలు నిర్వహించినట్లు రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ టి.రాజశేఖరరెడ్డి తెలిపారు. అధికారిక పర్యటనలో భాగంగా బుధవారం రాత్రి తెనాలి క్లబ్‌ను సందర్శించారు. స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన సభకు తెనాలి రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం అధ్యక్షుడు జెట్టి శివరామకృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి రాజశేఖరరెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలతో తొలి దశలోనే కొన్ని కేసులను గుర్తించగలిగామని చెప్పారు. తెనాలిలో కూడా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించాలని స్థానిక క్లబ్ బాధ్యులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు మూడు కిలో మీటర్ల పైబడి దూరం వెళుతున్న విద్యార్థుల కోసం ఆరు వేల సైకిళ్లను మార్చిలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. చిరువ్యాపారులకు 200 తోపుడు బండ్లను ఫిబ్రవరిలో ఇవ్వనున్నామని చెప్పారు. వీటిలో భాగంగా తెనాలి రోటరీ క్లబ్ వారు 100 సైకిళ్లు, మూడు తోపుడు బండ్లను ఇస్తారని చెప్పారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, రోటరీ క్లబ్ చేస్తున్న సేవలను అభినందించారు. రోటరీ 'చేయూత'లో భాగంగా రోటరీ క్లబ్, తెనాలి ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సులో నెలరోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందజేశారు. కార్యదర్శి నితిన్ చంద్, కోశాధికారి టి.భాస్కరరావు, జెట్టి అంకినీడు, అసిస్టెంట్ గవర్నర్ గుత్తా వెంకటరత్నం, బ్యూటీషియన్ అక్కినేని రమాదేవి, రోటరీ క్లబ్ సభ్యులు పావులూరి రాంబాబు, కన్నెగంటి మురళీకృష్ణ, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ నన్నపనేని ప్రతాప్, భాను, తాతాజీ, అన్నం పిన్నారావు, మురళీ మాస్టారు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి

దావులూరు(కొల్లిపర): జగనన్న కాలనీల్లో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణానికి ప్రతి లబ్ధిదారులకు రూ.5లక్షలు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ కోరారు. గురువారం సీపీఎం ప్రతినిధి బృందం మండలంలోని దావులూరు, చివలూరు గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి, లబ్ధిదారులు ఎదురు కుంటున్న ఇబ్బందులు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక ఇల్లు నిర్మించాలి అంటే రూ.10 లక్షలు వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ములకా శివ సాంబిరెడ్డి, జిలుగు ముక్కంటి పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

తెనాలి రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ కె. రవిబాబు గురువారం హెచ్చరించారు. తెనాలిలో కోడి పందేల బరులు ఏర్పాటు చేయకుండ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తెనాలి పట్టణం, మండలానికి సంబంధించి కోడి పందేలను నియంత్రించేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్ఐ, ఇద్దరు సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కోర్టు ఆదేశాలకు లోబడి ప్రజలు పండుగను జరుపుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు


ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు



గుప్తా డిగ్రీ కళాశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

తెనాలి అర్బన్: సంక్రాంతి వేడుకలను బుర్రిపాలెం రోడ్డులోని ఎస్ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో గురువారం వైభవంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అలాగే బోగిమంటలు, హరిదాసు సందడితో కళాశాలలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోగినేని విజయకృష్ణ, మేనేజర్ డి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.దశరథరామిరెడ్డి, కేవీ రవి కుమార్, టీజీ కళావతి, షేక్ రఫీ, టి.సాయిశంకర్, డాక్టర్ జెఎన్‌వి.నరేష్, ఎం.దుర్గారావు పాల్గొన్నారు.
+ ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామారావు పాల్గొన్నారు.

కళలు, సంస్కృతిని కాపాడుకోవాలి

తూములూరు(కొల్లిపర): మన పూర్వీకులు నుంచి వస్తున్న కళలు, సంస్కృతిని ప్రతి ఒక్కరూ కాపాడుకుంటూ భావితరాలకు వాటి స్ఫూర్తిని అందించాలని మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి అన్నారు .గురువారం శ్రీసీతారామాంజనేయ నాట్య కళామండలి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సందర్భంగా పౌరాణిక నాటకాల్లో సన్నివేశాల పోటీలు మండలంలోని తూములూరు గ్రామంలోని మర్రెడ్డి సుబ్బారెడ్డి ట్రస్ట్ కళ్యాణ మండపంలో నిర్వహించారు. అనంతరం తెనాలి, అత్తోట, కొల్లిపర, తూములూరు, కాకర్లమూడి, కుచ్చెళ్లపాడు గ్రామాల నుంచి వచ్చిన కళాకారులు నాటిక సన్నివేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కొల్లి బసివిరెడ్డి, కార్యదర్శి కొండా శివారెడ్డి, కొల్లి రాఘవరెడ్డి, మర్రెడ్డి సాంబిరెడ్డి, ఉమ్మూరు రాజ్యలక్ష్మి, సీతమ్మ, తుల్లిమిల్లి నాగరాజు, సిహెచ్.ఫణికుమార్, బి.మాధవరెడ్డి, అమ్మిశెట్టి మహేశ్వరరెడ్డి, ఆచంటి సాంబశివరావు, దేశిబోయిన శివయ్య, ఎ.వి.ఆదినారాయణరావు, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగించరూ!


తెనాలి మండలం హాఫ్‌పేట గ్రామ పరిధిలో ఉన్న గుంటూరు నల్ల డ్రెయిన్‌లో గుర్రపు డెక్క, తూటికాడ ఆకు పేరుకుపోయి ఉంది. దీనివల్ల పొలాల్లోని మురుగునీరు పారుదల కావడం లేదు. గుర్రపు డెక్క తొలగించాలని రైతులు కోరుతున్నారు. -తెనాలి టౌన్

ఇళ్ల నిర్మాణంపై అధికారులతో సమీక్ష సమావేశం



తెనాలి అర్బన్: నియోజకవర్గంలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై బుధవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని హౌసింగ్ సహా వివిధ విభాగాల అధికారులతో చర్చించారు. పెదరావూరు, సిరిపురం, గోలిడొంక లేవుట్‌లో ఇళ్ల నిర్మాణాల గురించి చర్చించారు. అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని, ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఎమ్మెల్యే శివకుమార్ కోరారు. పెదరావూరు లే అవుట్ తరహాలోనే నేలపాడు, సిరిపురం, గోలిడొంకలో నిర్మాణాలు ప్రారంభించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ యం జస్వంతరావు, హౌసింగ్ ఈఈ డీఈ రఫి, ఏఈ పిచ్చయ్య పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజుస్వామి ఆరాధన ఉత్సవం


త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్వాంసులు

తెనాలి టౌన్: త్యాగరాజ గానసభ తెనాలి ఆధ్వర్యంలో బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గాన సభ అధ్యక్ష, కార్యదర్శులు త్రిపురమల్లు వెంకట సుబ్బారావు, అగ్నిహోత్రం ధన్వంతరిలు పర్యవేక్షణలో ఆగమపండితులు బ్రహ్మశ్రీ శ్రీనివాసు శర్మ త్యాగరాజుస్వామి సీతారామచంద్రుల పరివార ప్రతిమలకు పంచామృత అభిషేకం జరిపి పూజలు జరిపారు. సంగీత విద్వాంసులు కూరపాటి తుషార పూర్ణవల్లి, జి.సూర్యకాంతి, గండూరి నాగేశ్వరరావు ఆలపించిన పంచరత్న కీర్తనలు విశేషంగా అలరించాయి. వయొలిన్ సహకారం సుబ్రహ్మణ్యరాజు, మృదంగం సహకారం అనిల్‌కుమార్‌లు అందించారు. త్యాగరాజ గాన సభ ప్రతినిధుల సేవలను విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ అమిరినేని శివరామప్రసాద్ కొనియాడుతూ, స్ఫూర్తి సందేశం అందజేశారు. సందర్భంగా సంగీత విద్వాంసులను సత్కరించారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త కొత్త సుబ్రమణ్యం, శశి గ్రూపు అధినేత వుప్పల వరదరాజులు, గాన సభ కోశాధికారి వివి.శర్మ, పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో యడ్లపల్లి జెడ్పీ విద్యార్థుల ప్రతిభ


శివనాగరాజు రెడ్డి


అక్షిత్ రెడ్డి

యడ్లపల్లి(వేమూరు): జిల్లాస్థాయి స్కూలు గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీ రాణి తెలిపారు. గుంటూరు జిల్లా నంబూరు జడ్పీ పాఠశాలలో గురువారం జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో చుండూరు మండలం యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎ.శివరాగరాజు రెడ్డి 1500 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానం సాధించారు. ఎస్.అక్షిత రెడ్డి 3000 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం ఈ సాధించారు. ఈ నెల 19వ తేదీ నుంచి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. విద్యార్థులను, పీఈటీ వేమూరి శరత్‌బాబును ఉపాధ్యాయులు అభినందించారు.

మార్కెట్ ఏరియా దుకాణంలో చోరీ

సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు


సీసీ కెమెరాల్లో రికార్డయిన దుండగుడి కదలికలు

తెనాలి రూరల్: స్థానిక గాడిబావి సెంటర్‌లోని రాములు వారి గుడి వద్ద దుకాణంలో దుండగుడు చోరీకి పాల్పడిన ఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు.. గుడి కాంప్లెక్సులో నిర్వహిస్తున్న కొబ్బరికాయలలు, అగర్‌బత్తీల షాపులో దుండగుడు చోరీకి పాల్పడ్డాడు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో షాపు వద్దకు వచ్చిన దుండగుడు తాళాలు పగుల కొట్టి లోనికి ప్రవేశించాడు. అక్కడ ఉన్న సీసీ కెమెరాలు తొలగించి చోరీకి పాల్పడ్డాడు. సీసీ కెమెరాలను తొలగిస్తున్న దశ్యాలు అక్కడ రికార్డయ్యాయి. క్యాష్ కౌంటర్‌లోని నగదు చోరీ చేసి పరారయ్యాడు. ఉదయం షాపు వద్దకు వచ్చిన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా టూ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. కౌంటర్‌లో ఉంచిన సుమారు రూ.20 వేలు, రూ.10 వేల విలువైన పాత కరెన్సీ నోట్లు అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. దుండగుడు మాస్క్ వేసికొని కొట్టు తాళాలు పగల కొట్టి లోపలకి ప్రవేశించి మొదట సీసీ కెమెరాలు ఎక్కడ ఎక్కడ ఉన్నాయో గమనించి వాటిని తొలగించాడు. సీసీ కెమెరాలు తొలగించే సమయంలో మాస్క్ పెట్టుకొని ఉన్న అతడి ముఖం సీసీ కెమెరాలలో రికార్డ్ అయింది. దుకాణ నిర్వాహకుడు రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ, ఎప్పటి లాగే గత రాత్రి 10.30 సమయంలో కొట్టుకు తాళం వేసి ఇంటికి వెళ్లానని, ఉదయం 5గంటల సమయంలో దుకాణం తెరవటానికి వస్తే తాళాలు పగలకొట్టి ఉన్నాయని తెలిపారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరపురాని రోజులు..

ఎన్నో మరపురాని రోజులు.. మధుర జ్ఞాపకాల జడి.. ఎదో సాధించాలనే తపన.. కాలం సాగిపోయింది.. ఏళ్లు గడిచిపోయాయి.. తాతా అని పిలుపునకు చేరువైనా.. ఆ ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే ఆ హృదయాలు ఉప్పొంగాయి. అక్షరాలు దిద్దించిన గురువుల జ్ఞాపకాలు మదిలో మెదులుతుండగా.. బాల్యపు స్నేహ మాధుర్యాలు అక్షర కుసుమాలై పరిమళించాయి. తమ చదువుల గుడికి దాతృత్వపు హారం వేసిన అపూర్వ ఘట్టాలు కొల్లిపర పాఠశాలలో ఆదివారం ఆవిష్కృతమయ్యాయి.


కొల్లిపరలోని అద్దనూరి వారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 42 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

- 'అ'పూర్వ' సమ్మేళనం
- 42 ఏళ్ల తర్వాత సంబరం
- గురువులకు సన్మానం


కొల్లిపర: స్థానిక అద్దనూరి వారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1980-81 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. సుమారు 140 మందితో పండుగ వాతావరణం నెలకొంది. లెక్కలు, తెలుగు మాస్టార్ వేసిన జోకులు, సైన్సు, ఇంగ్లిష్ మాస్టార్ చెప్పిన పాఠాలు గుర్తు చేసుకున్నారు. పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులైన పిచ్చయ్య శర్మ, సూరారెడ్డిలను సన్మానించారు. సుమారు 42 సంవత్సరాలు అనంతరం తామవంతా ఒక చోట కలుసుకోవడటం అద్భుతంగా ఉందన్నారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జొన్నల శ్యామ్‌సుందర రెడ్డి, మిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. తొలుత పాఠశాలలోని సరస్వతి దేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహించి ఉపాధ్యాయులను సత్కరించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ స్రవంతిరాయ్, పక్కన సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ ఉమామహేశ్వరరావు

తెనాలి రూరల్: చోరీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ స్రవంతి రాయ్ వెల్లడించారు. నాజరుపేట చెరువువారి వీధిలో నివసిస్తున్న పుట్రేపు రత్నకుమారి 2వ తేదీన నరసరావుపేటలో ఓ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి మరుసటి రోజు ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. బాలాజీరావుపేటకు చెందిన చిలుమూరి నాగరాజు, నందివెలుగుకు చెందిన పిల్లి సురేష్, ముత్తింశెట్టిపాలేనికి చెందిన పోతురాజు సాయికుమార్‌లను నిందితులుగా నిర్ధారించినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 108 గ్రాముల బంగారు ఆభరణాలు, 800 గ్రాముల వెండి వస్తువులు, నేరానికి వినియోగించిన ఆటో స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. చోరీ సొత్తు విలువ రూ.5,92,720 ఉంటుందని డీఎస్పీ తెలిపారు. కొద్ది రోజుల్లోనే కేసు చేధించి చోరీ సొత్తు రికవరీ చేసిన ఒన్‌టౌన్ సీఐ కె.చంద్రశేఖర్, ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు, ఏఎస్ఐ కె.రత్నరాజు, సిబ్బంది ఎన్.శ్రీనివాసరావు తదితరులను డీఎస్పీ అభినందించారు. ఇళ్లకు తాళం వేసి వేళ్లే వారు తప్పనిసరిగా పోలీసు శాఖ అందిస్తున్న లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం సేవలను వినియోగించుకోవాలని డీఎస్పీ సూచించారు. దీని వల్ల నేరాలను నిరోధించడంతో పాటు, నేరస్తులను త్వరిత గతిన గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

బాలల హక్కులు, సమస్యలపై శిక్షణ కార్యక్రమం


శిక్షణలో మాట్లాడుతున్న సమన్వయకర్త తిరుపతిరావు

తెనాలి టౌన్: బాలికలపై వివక్ష నిర్మూలించాలని, బచ్‌పన్ బచావో ఆందోళన్ రాష్ట్ర సమన్వయకర్త జి.తిరుపతిరావు కోరారు. రూరల్ మండలం హాఫ్‌పేటలో చైల్డ్ రైట్స్ అడ్వొకేసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల హక్కులు, సమస్యలపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. శిక్షణలో తిరుపతిరావు మాట్లాడుతూ సమాజంలో కుటుంబాలలో బాలికలపై జరుగుతున్న లింగ అసమానతలు, సామాజిక కట్టు బాట్లు, మత కట్టు బాట్లు తొలగించి సమాన అవకాశాలు కల్పించాలన్నారు. అన్ని రంగాల్లో బాలకలు అభివృద్ధి చెందే విధంగా చేయడం అందరి బాధ్యతన్నారు. గ్రామ సర్పంచి తలమాల యర్రయ్య మాట్లాడుతూ బాలల హక్కుల గురించి అందరూ తెలుసుకోవాలని, బాలల అభివృద్ధి కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలు కలసి పనిచేయాలన్నారు. బాలలు ఆత్మ విశ్వాసం, లక్ష్య సాధన, జీవన నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలన్నారు. బాలలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 181 మహిళా హెల్ప్‌లైన్, 100 పోలీసు వారికి ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో క్రాఫ్ జిల్లా సమన్వయకర్త జి.వెంకయ్య, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ఇందు కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ రేవతి, సంక్షేమ సహాయకురాలు చంద్రిక పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో బుధవారం రాత్రి ప్రమాదవశాత్తూ పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన చేబ్రోలు యాకోబు ఒంటి నిట్టాడు ఇల్లు అగ్నికి ఆహుతి అయ్యింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్తువులు అన్నీ దగ్ధమయ్యాయని రేపల్లె స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వై. సాంబశివరావు గురువారం తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగలేదని, మంటలను ఆర్పి నియంత్రించినట్లు చెప్పారు. ప్రమాదానికి కారణం తెలియలేదని పేర్కొన్నారు.